


## కథ

**మన్నె సత్యనారాయణ**

# ఒక పెన్షనరు కథ

సుబ్బరామయ్యగారు హైదరాబాద్ రైల్వే స్టేషన్‌లో బండి దిగి బైటకొచ్చారు.

''ఆటో సార్!'' అన్నాడొక ఆటోడ్రైవరు.

సుబ్బరామయ్యగారు జేబులోంచి కాగితం తీసి ''ఈ అడ్రసుకెళ్లాలి'' అన్నారు.

''ఎక్కండి సార్'' అన్నాడతను.

''చూడు బాబూ! నేను పల్లెటూర్నొంచొచ్చాను. నాకిక్కడ రోడ్లూ, వీధులూ తెలియవు. అక్కడా ఇక్కడా తిప్పకుండా నేరుగా తీసుకెళతావా?''

''అందరాటోవాళ్లూ ఒకేలా ఉండరు సార్. మీరు పెద్దోరు. జాగ్రత్తగా తీసుకెళతాను. ఎక్కండి'' అన్నాడతను.

ఆయన చేతిలోని బట్టల సంచీతో ఆటో ఎక్కారు. ఆటో జాగ్రత్తగానే తీసుకెళ్లాడు. ఇంటి నెంబరు చప్పున దొరక్కపోతే, డ్రైవరే అక్కడి వాళ్లనడిగి ఆ ఇంటికి తీసుకెళ్లాడు.

ఆయన తలుపు తట్టారు. సుమారు 35 సంవత్సరాల వయసున్నావిడొచ్చి తలుపు తీసింది. ఎదురుగా ఉన్న పెద్దాయన్ని ఎవరా అని చూసింది.

''అమ్మ, నీవు రాఘవాపురం సుబ్రహ్మణ్యం గారమ్మాయివా?'' అడిగారు.


''అవునండి. మీరు..?'' అందామె.

''నా పేరు సుబ్బారామయ్య. మీ నాన్నగారికి స్నేహితుడ్ని. మీ ఊరి దగ్గర్లోని నర్సన్నపేట మాది'' అని పరిచయం చేసుకున్నారాయన.

''అలాగా! రండి లోపలకి'' అని ఆహ్వానించిందామె.

ఆయన లోపలికడుగు పెట్టి, చేతిలోని సంచి కింద పెట్టకుండానే ఆమెతో అన్నారు. ''ఇక్కడ పనుండొచ్చాను. హోటల్ గదిలో ఉండలేను. మీ మేనమావ నర్సింహమూర్తి మీ అడ్రసిచ్చాడు. మీకిబ్బంది కాకపోతే మీ ఇంట్లో రెండ్రోజులుంటాను'' అన్నారు.

''ఉండండి బాబాయిగారూ. మాకేం ఇబ్బంది లేదు. ఇదిగో ఈ గదిలో ఉండండి. బాత్‌రూమ్ అదే. స్నానం చెయ్యండి. ఈలోగా కాఫీ తెస్తాను'' అని వెళ్లిందామె.



సుబ్బరామయ్యగారు స్వాతంత్ర్య సమరయోధులు. వయసు 86 సంవత్సరాలు. ఆవిడ తండ్రి కంటే కొంచెం పెద్దవారు. సమరయోధుల పెన్షన్, ఇతర సదుపాయాలకు పూర్తి బెనిఫిషియరీ లెటరాయనకు రాలేదు. ఆ వయసులో ప్రయాణం కష్టమైనా దాని కోసమే వచ్చారు.

ఆయన స్నానం చేసి బట్టలు మార్చుకునేసరికామె టిఫిను, కాఫీ తెచ్చింది. ''ఇదివర్లో మిమ్మల్ని చూడకపోయినా, మా నాన్నగారు చెప్పగా విన్నాను మీ గురించి. మీరు స్వాతంత్ర్య సమరయోధులు. అవునా? మా నాన్నగారికో మంచి సాయం కూడా చేశారంట ఓసారి. మొహమాట పడకండి. వారం రోజులైనా ఇక్కడే ఉండండి'' అందామె.

కాఫీ తీసుకుని, సంబంధిత ఫైలు తన సంచిలోంచి తీసుకుని బయలుదేరారాయన.

''మీ పిల్లలూ, మీ వారూ కనబడరేం'' అనడిగారు వెళ్లే ముందు.

''పిల్లలు స్కూలుకెళ్లారు. ఆయన మీరొచ్చే ముందే ఆఫీసుకెళ్లారు'' అంది.

''సాయంత్రం వస్తానమ్మా'' అని చెప్పి వెళ్లారాయన.

★ ★ ★

ఆయన తానెళ్లవలసిన ఆఫీసుకు ఆటోలో వెళ్లారు. అక్కడ రిసెప్షన్‌లో ఉన్నామెకు ఫైలు చూపించి, ఈ పనెవరు చూస్తారు అనడిగారు.

''అదిగో, ఆ పక్కన కూర్చున్నారు చూడండి రాజేశ్వర్రావుగారని జూనియరాఫీసర్. ఆయనే ఇవి చూస్తారు'' అని చెప్పింది.

సుబ్బరామయ్యగారు రాజేశ్వర్రావు దగ్గరకెళ్లారు. అతనేవో కాగితాలు చూసుకుంటున్నారు. ఈయన వచ్చి తన టేబిలుకెదురుగా నిలబడ్డం గమనించాడు. కానీ తలపైకెత్తి లేదు. ఓ నిమిషం చూశారాయన.

''బాబూ, రాజేశ్వర్రావుగారూ! నా పేరు సుబ్బరామయ్య. మీతో పనుండొచ్చాను'' అన్నారు.

అప్పుడతను పైకి చూశాడు. ''ఏమిటి పని?'' అనడిగాడు. కూర్చోమనలేదు.

ఆయన తన చేతిలోని ఫైలునతనికందించాడు.

అది చూసి, ''మీ ఫైలు తెప్పించి చూడాలి. ఏ దశలో ఉందో. వెంటనే అయ్యే పని కాదు'' అన్నాడు నిర్లక్ష్యంగా.

''చాలా దూరం నుంచొచ్చాను బాబూ. పెద్దవాడ్ని ఎక్కువ రోజులుండలేను'' అన్నారాయన అభ్యర్థనగా.

''అందరికీ అర్జెంటే! మాకూ వేరే అర్జెంటు పనులుంటాయి. ఓ వారమైనా పడుతుంది''

''అలా అనకండి. మీ ముందో ఆఫీసరుండేవారిక్కడ. ఇదివరకోసారొచ్చాను. మీ పని పూర్తి చేసి ఒక నెలలోపులో కాగితం మీకు పోస్టులో పంపిస్తాం అని చెప్పారాయన. కానీ అది రాలేదు. అందుకే ఇప్పుడు మళ్లీ వచ్చాను.''

''ఆయన ట్రాన్స్‌ఫర్ అయ్యారు. మీకంత కంగారైతే ఎలా?'' అని అటెండరును పిలిచి ఆ ఫైలు తెమ్మన్నాడు. ఆయనను కూర్చోమనలేదు.

ఫైలు వచ్చింది. చూశాడు. ఫైలు ఎంతవరకూ నడిచిందో అతనికర్థమైంది. అప్పుడాయనను కూర్చోమన్నాడు.

''ఇది నా ఒక్కడితో అయ్యే పని కాదు. ఇద్దరు ముగ్గురు సంతకాలు పెట్టాలి. మామూలు ప్రొసీజరు ప్రకారం పనవ్వాలంటే, ఫైలు వాళ్ల దగ్గరకు కదపాలి. అదలా కదుల్తూనే ఉంటుంది. ఎప్పటికి పూర్తవుతుందో చెప్పలేం. అందుకే ఎవరికివ్వాల్సినవి వాళ్లకిచ్చేస్తే, వెంటనే అయిపోతుంది. మీరు పెద్దవారు.. అన్నిసార్లు తిరగలేరు. మీ మంచికే చెబుతున్నాను. తర్వాత మీ ఇష్టం'' అన్నాడు నెమ్మదిగా.

ఇటువంటివి ఇదివరకే విని ఉన్నాడాయన. ఎంతో కొంత ఇచ్చేసి చేయించుకోమని సలహా ఇచ్చారు తెలిసిన వాళ్లు. అందుకే ఆయనందుకు సిద్ధపడే ఉన్నారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో 'బ్రిటీష్ ఆఫీసర్లు కూడా ఇంత కఠినంగా ఉండేవారు కారు' అనుకున్నారాయన.

''మీరేం ఆలోచిస్తున్నారు? ఇటువంటివన్నీ సాధారణమే ఆఫీసుల్లో. అదిగో ఆ చివరనున్నతను నా కింద ఉద్యోగి. నా టి.ఎ. బిల్లులు అతని దగ్గర్నుంచి రావాలి. అతనికన్నా నేను పై ఆఫీసర్నే అయినా, వందో రెండొందలో ఇస్తే కానీ అతను చేయడు. నేనతని మీద ఫిర్యాదు చేశాననుకోండి అతను నా మీద యూనియన్ వాళ్లకు, నేను హెరాస్మెంట్ చేస్తున్నానని ఫిర్యాదు చేస్తాడు. అందుకని, అతనికెంతో కొంతిచ్చి నా బిల్లులు తెచ్చుకుంటాను'' అన్నాడు.



''అలాగే బాబూ, ఏమివ్వాలో చెప్పండి'' అన్నారాయన ఎలాగూ తప్పదని.

''ఓ రెండు వేలివ్వండి. సాయంత్రానికి మీ కాగితాలు పూర్తి చేసి మీకిస్తాను''

''రెండు వేలా! నాకంత తాహతు లేదు. హోటల్లో ఉంటే ఖర్చవుతుందని తెలిసిన వాళ్లింట్లో దిగాను. ఓ వెయ్యి రూపాయలిస్తాను. ఎలాగోలా చేసి పెట్టండి''

''నా ఒక్కడితో అయ్యే పనైతే అలాగే చేద్దును. ఇద్దరు ముగ్గురికివ్వాలి''

''ఏం చేస్తారో మీరే చేయండి. ఊరకనే చేసి పెట్టారనుకుంటాను'' అన్నారాయన ప్రాధేయపూర్వకంగా.

అతనో నిమిషం ఆలోచించి ''సరే ఇవ్వండి'' అన్నాడు.

ఆయన జేబులోంచి వెయ్యి తీసి అతనికిచ్చారు.

''మీరు మధ్యాహ్నం రెండు గంటలకు రండి. పని పూర్తి చేయిస్తాను'' అన్నాడతను.

సుబ్బరామయ్యగారు బైటికొచ్చారు. పక్కనే ఉన్న చిన్న హోటల్లో కాస్త భోజనం చేశారు. మళ్లీ ఆఫీసులోకెళ్లి రిసెప్షన్‌లో కూర్చున్నారు.

అసలేం జరిగిందంటే ఈ రాజేశ్వర్రావుకు ముందున్న ఆఫీసరుండగానే. అందరి సంతకాలూ చేయించి పని పూర్తి చేశాడు. పెద్దాయన కనుక, జాలిపడి, ఏమీ తీసుకోకుండానే, పని చేసి పెడదామనుకున్నాడా ఆఫీసరు. అయితే, అప్పుడు టైపిస్టు రెండొందలిస్తే కానీ చెయ్యనన్నాడు. ఆఫీసరు టైపిస్టునేమీ చేయలేకపోయాడు. ఇంతలో ఆ ఆఫీసరు ట్రాన్స్‌ఫరయ్యాడు. ఇప్పుడు రాజేశ్వర్రావు ఫైలు తెప్పించి చూస్తే పని పూర్తయింది. ఈ లెటరు టైపుచేయించి, తను సంతకం చేయించి ఇచ్చేస్తే, మొత్తం డబ్బు తానొక్కడే నొక్కేయొచ్చుననుకున్నాడు. ఆయన బైటకెళ్లగానే టైపిస్టును బతిమాలి టైపు చేయించి తను

## ఇదో సెంటిమెంట్!

**సినిమా వాళ్లకి సెంటిమెంట్లు కాస్త ఎక్కువే అంటారు. చాలా సందర్భాల్లో ఇది రుజువవుతూనే వుంది. కొత్తతరహా చిత్రాల దర్శకుడిగా పేరు తెచ్చుకున్న శేఖర్ కమ్ములకి కూడా ఓ సెంటిమెంట్ వున్నట్టుంది. తన చిత్రం 'ఆనంద్'లో హీరోయిన్‌గా నటించిన కమలినీ ముఖర్జీతో 'గోదావరి' సినిమాని తీసాడాయన. ఆ తర్వాత హ్యాపీడేస్‌లో కూడా అతిథి పాత్రనిచ్చాడు. ఆయనే నిర్మించిన (దర్శకత్వం చేయలేదు) 'ఆవకాయ్ బిర్యానీ'లో మాత్రం కమలినీ నటించలేదు. ఇప్పుడు శేఖర్ తాజాగా డైరెక్ట్ చేసిన 'లీడర్'లో కమలినీ ఎమ్మెల్యే పాత్ర పోషించింది.**

సంతకం చేసేశాడు.

అప్పటికి రెండు గంటలయ్యింది. రిసెప్షన్లో కూర్చున్న సుబ్బరామయ్యగార్ని పిలిచాడు. ఆ కాగితాలాయన చేతిలో పెట్టాడు. అంత తొందరగా ఫైనైందంటే అసలు జరిగిందేవిటో కొంతవరకూ ఆయనూహించగలిగారు.

''మంచిదే బాబూ! ఆనాడు గాంధీజీ లాంటి అగ్రనాయకుల దగ్గర్నుంచి, మాలాంటి సాధారణ కార్యకర్తల వరకూ పిల్లల్నీ కుటుంబాల్నీ పట్టించుకోలేదు. మా ఆస్తుల్ని ఖర్చు పెట్టేశాం. ఇబ్బందులు పడ్డాం. నెలల తరబడి ఇంటిపట్టున లేకుండా తిరిగాం. అప్పుడు మేం చేసిన త్యాగాలన్నీ ఇలాంటి స్వాతంత్ర్యం కోసమేనా అనిపిస్తున్నది'' అన్నారాయన ఆవేదనతో.

''అసలు మిమ్మల్ని త్యాగాలెవరు చెయ్యమన్నారు? మీరంతా త్యాగాలు చేయకపోయినా, ఈ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఉండేది! ఎలాగంటారా? ఆనాటి నాయకులూ, మీలాంటి ప్రజలూ పెద్దతరహా మనుషులు! నీతి, దేశభక్తి అనే అనవసర ఆవేశాలతో తిరిగారు. మీరంతా అంతమెత్తనోళ్లు కనుకనే, బ్రిటీష్‌వాళ్లు మిమ్మల్ని పాలించగలిగారు. కానీ తర్వాత తరాల వాళ్లమైన మాలాంటి ప్రజలూ, ఉద్యోగులూ, నాయకులూ అంతా ఘటికులే. మాకు కలిసొస్తుందంటే ఏదైనా చేస్తాం. అవసరమైతే బ్రిటీష్‌వాళ్ల నెత్తుల మీద కూడా చేతులు పెట్టగల వాళ్లే ఇప్పటి వాళ్లు. ఇలాంటి నాయకుల్నీ ప్రజల్నీ పాలించలేక, బ్రిటీష్ వాళ్లే వాళ్ల దేశానికి పారిపోయి ఉండేవారు. అలాగొచ్చి ఉండేది మనకు స్వాతంత్ర్యం!'' అన్నాడు.

''నిజమే! ఇప్పటి వాళ్లతో వేగలేక ఆ బ్రిటీష్ వాళ్లే పారిపోయి ఉండేవాళ్లు. నీవు నా దగ్గర వెయ్యి రూపాయలు తీసుకున్నా కూడా, పది లక్షలు విలువ చేసే నిజం చెప్పావు''

''నే చెప్పిందాంట్లో నిజం ఉందంటారా లేదా?''

''పని చేసి పెట్టావు. వస్తాను బాబూ!'' అని భారంగా కుర్చీ నుండి లేచారు.

''కాస్త కాఫీ తెప్పిస్తాను. తీసుకు వెళ్లండి'' అన్నాడు రాజేశ్వర్రావు.

''వద్దులే బాబూ. అంతకంటే ప్రశస్తమైన నిజాలు తెలిశాయి''

★ ★ ★

సుబ్బరామయ్యగారు ఇంటికి తిరిగొచ్చేసరికి మూడు గంటలయ్యింది.

''పనెంతవరకూ అయ్యింది బాబాయిగారూ?'' అనడిగిందామె.

''పని పూర్తయిందమ్మా. అందుకే తొందరగా వచ్చాను'' అన్నారు.

''ఏవిటీ! ఈ రోజుల్లో ఆఫీసుల్లో పనులింత వేగంగా అవుతున్నాయా?'' అందామె ఆశ్చర్యంగా.

''సమాజంలో వేగం పెరిగింది. ఆ వేగం ఆఫీసుల్లోనూ పెరిగింది. కాకపోతే ఆ వేగానికి తగ్గ ఇంధనం మనమిచ్చుకోవాలి'' అన్నారాయన వ్యంగ్యంగా.

ఆమెకర్థమైంది. ''ఎంతిచ్చారేవిటి?'' అంది నవ్వుతూ.

''ముందు రెండు వేలడిగాడు. అంతిచ్చుకోలేనని బతిమాలితే, వెయ్యికొప్పుకున్నాడు. అసలు ఇదివరకటాఫీసరుండగానే పని పూర్తయింది. ఇతను తానే ఆ పని చేశానని, ఆ కాగితాలు నాకిచ్చి వెయ్యి తీసుకున్నాడు''

''ఎంత దగా! ఇంతకీ ఏ ఆఫీసుకెళ్లారు? అక్కడెవర్ని కలిశారు?''

ఆయనాఫీసు పేరు చెప్పారు. ''అక్కడ రాజేశ్వర్రావని జూనియరాఫీసరున్నాడు. అతన్తోనే పని''

''ఏవిటీ... ఆ ఆఫీసుకా మీరెళతా? రాజేశ్వర్రావు గారంటే.. ఎర్రగా ఎత్తుగా ఉంటారు.. ఆయనా?'' అందామె తడబడుతూ. ఆమె ముఖం వివర్ణమైంది.

''అవునమ్మా. ఆర్.రాజేశ్వర్రావు. అతను నీకు తెలుసా?'' అనడిగారు.

''తెలుసా అంటే.. ఓసారాయన మావారి కూడా మా ఇంటికొచ్చారు''

ఆమెలో కొంత కంగారు కనిపించింది. ఈ ఘనకార్యం వెలగబెట్టింది తన భర్తేనని ఆమెకర్థమైంది. ఎలా? సాయంత్రమాయన ఇంటికొచ్చారా, ఈ బాబాయిగారతన్ని చూస్తారు అనుకుని సిగ్గుపడింది.

''అమ్మా పనైపోయింది కదా. ఈరోజే వెళ్లిపోతాను'' అన్నారాయన.

ఆయనింటికొచ్చేలోగా ఈయనెళ్లిపోతే, ఆ ఘనుడే తన భర్తని ఈయనకు అర్థం కాదు. అందువలనీయన వెళ్లిపోతేనే మంచిదనుకుంది. మాటవరసకు మాత్రం రెండ్రోజులుండమంది. కానీ ఆయన వెళతానన్నారు.

కొంత డబ్బు తీసుకొచ్చి ''బట్టలు తీసుకోండి బాబాయిగారూ'' అంది.

''వద్దమ్మా. కన్నబిడ్డలాగా ఆదరించావు. అదే పదివేలు. మళ్లీ బట్టలేంటి?'' అన్నారు.


''నేను మీ కూతుర్నే అనుకోండి. బట్టలు తీసుకోండి'' అని కొంత చనువు తీసుకుని ఆయన జేబులో పెట్టేసింది.

రైల్వే ప్లాట్‌ఫారం మీద కూర్చునుండగా ఆవిడెందుకో గుర్తొచ్చిందాయనకి. 'ఎంత మంచి పిల్ల! బాగా చూసింది. బట్టలకూ డబ్బు కూడా ఇచ్చింది' అనుకున్నారు. ఎంతిచ్చిందోనని జేబులోంచి డబ్బు తీసుకుని చూసుకున్నారు. వెయ్యి రూపాయలు! ఇంత డబ్బిచ్చిందేవిటి అని ఆశ్చర్యపడ్డారు. ఆయనకామె మాటలు గుర్తొచ్చాయి.

'మీరెళ్లిందా ఆ ఆఫీసుకా? రాజేశ్వర్రావుగారంటే ఎర్రగా పొడుగ్గా ఉంటారాయనా?' అని ఆమె అన్న మాటలు గుర్తొచ్చాయి ఆయనకి.

సుబ్బరామయ్యగారికి అర్థమైంది.

'భర్త చేసిన తప్పును భార్య సరిదిద్దింది. ఎంత మంచిపిల్ల!' అనుకున్నారు. ☆



## ముచ్చటగా మూడోసారి..

**కేరళకుట్టి సింధుమీనన్ ముందు భద్రాచలం సినిమాతో టాలీవుడ్‌లోకి అడుగుపెట్టి అంతగా వెలుగులోకి రాలేదు. తర్వాత 'చందమామ'తో నలుగురి దృష్టినీ ఆకట్టుకుని కొన్ని సినిమాలు చేసాక దాదాపు ఏడాదిగా ఒక్క తెలుగు సినిమాలోనూ ఎంపిక కాలేదు. మళ్లీ ముచ్చటగా మూడోసారి ఇప్పుడు 'సుభద్ర' అనే సినిమాతో తిరిగి టాలీవుడ్‌కి వస్తోంది. ఈసారయినా తనకి అదృష్టం కలిసొచ్చి కెరీర్ ముందుకెళుతుందని ఎంతో ఆశగా ఎదురుచూస్తోంది సింధు.**